# ఫిలోత్ర్సవ్

# దే ఆల్ లవ్డ్ హిమ్

(ఇటాలియన్ ఫిల్మ్)

"ఒరేయ్, నువ్వు నా కడుపున చెడబుట్టావ్ రా" అని మీ అబ్బాయిని ఎప్పుడైనా విసుక్కున్నారా. లేక మీరు తండ్రి అయితే మీ అబ్బాయిని "వెధవా- నువ్విలా అల్లరి చేశావంటే హాస్టల్లో చేర్పిస్తా" నని బెదిరించారా?

ఒక క్షణం ఊహించండి. మీ అబ్బాయిని మీ పక్కింటాయనో- మీ స్నేహితుడో దూరంగా తీసుకెళ్ళి ఊరిబైట కొండల్లో వదిలేసి వచ్చి, అబ్బాయేడని మీ రడుగుతే, "రోగి కోరిందీ, డాక్టరు చెప్పిందీ ఒకటే కదోయ్. ఎలాగో మీ దంపతులు మీ కుర్రాడి గురించి బాధ పడ్తున్నారు కాబట్టి ఆ పని నేనే చేసివచ్చాను" అన్నాడనుకోండి. అప్పుడు మీ మొహం క్లోజప్ లో ఎలా వుంటుంది?

ఒక కార్లో- ఒక పక్కింటి పెద్దమనిషీ- ఒక అల్లరబ్బాయీ వెళ్తున్నారు. కార్లో ట్రాన్సిస్టర్ ని అబ్బాయి గట్టిగా పెట్టాడు. తగ్గించకపోతే దింపేస్తానన్నాడు పెద్దమనిషి.

దింపితే మళ్ళీ వెతుక్కుంటూ వస్తావు అన్నాడా అబ్బాయి. కారాపి, దిగు అన్నాడు పెద్దమనిషి. దిగుపోయాడు కుర్ర వాడు. అంతే! సమస్య మొదలైంది.

అయితే ఈ సమస్య పైకి కనబడేటంత చిన్నది కాదు. ఈ కామెడీ వెనుక మన ఊహాకందనంత ట్రాజెడీ వుంది.

అతడు పుట్టేసరికి తల్లిదండ్రుల మధ్య పొరపొచ్చా లొచ్చాయి. అదృష్టవశాత్తూ అవి విడిపోయేటంత పెద్దవి కావు. కానీ, ఇద్దరూ ఆవేశపరులే. ఎంత ఆవేశపరులంటే— నెలల అబ్బాయిని సీట్లమధ్య ఉయ్యాల్లో పడుకోబెట్టి రైల్లో ప్రయాణం చేస్తూ దెబ్బలాడుకుంటారు. భార్య కోపం వచ్చి రైలాగ్గానే చిన్న స్టేషన్‌లో దిగింది. ఆమెని బ్రతి మాలుకుంటూ భర్తా దిగి వెంటబడ్డాడు. రైలు కదిలి పోయింది. దంపతులు కంగారుపడి అయిదారు స్టేషన్లవతల వూళ్ళో వున్న తాతగారికి ఫోన్ చేసి, ఫలానా కంపార్టు మెంట్‌లో వున్న పాపని ఇంటికి తీసుకెళ్ళమని చెప్పారను కోండి— అది వేరే సంగతి.

ఏదైనా నవల్లోగానీ, సినిమాలోగానీ సెల్ఫ్ ఐడెంటి ఫికేషన్ సబ్జెక్టు వుంటే అది హృదయాలకి హత్తుకుపోతుంది. "కాత్తదనానికి" అడ్డు వస్తున్నాడన్న నెపంతో నెలల కొడు కుల్నీ, కూతుళ్ళనీ తాతగారింట్లో వదిలేస్తే వాళ్ళు మాన సికంగా ఎలా దూరం అవుతారో తెలియజెప్పే చిత్రం ఇది.

—ఓ పదేళ్ళుపోయాక తమ కొడుకుని తమతో వుంచు కోవాలన్న కోర్కె తల్లిదండ్రులకి కలుగుతుంది. పల్లెలాటి

ఫార్మ్‌ను వదిలేసి రానంటాడు ఆ అబ్బాయి. సామదానభేద దండోపాయాల్తో అతడిని తమతో పాటు తీసుకెళ్తా రా తల్లి తండ్రులు. తను ముద్దుగా పెంచుకున్న కుందేల్ని తనతో తీసుకువస్తాడు ఆ అబ్బాయి. అబ్బాయికి పక్కరూమ్ ఇస్తారు.

అక్కణ్ణుంచి సమస్యలు ప్రారంభం అవుతాయి. రాత్రిళ్ళు వాళ్ళ గుసగుసలు- అతడిని ఇబ్బంది పెడ్తాయి. వచ్చి మధ్యలో పడుకుంటానంటాడు. తల్లి వేరేచోట ఉద్యోగానికి వెళ్ళటంతో ఆ సమస్య పరిష్కారం అవుతుంది తాత్కాలికంగా.

కానీ తండ్రి గర్లు ఫ్రెండ్ తో మళ్ళీ ఇబ్బంది మొదలవుతుంది. కొడుకుని వీధుల్లో పచార్లకి పంపి- ఇంట్లో ఓ రెండు గంటల పాటూ "తాత్కాలిక" సంసారం పెడ్తాడు తండ్రి. బైట్నుంచి కొడుకు "నాన్నోయ్! తాతయ్య కారు ఇంటివైపు దూసుకొస్తూంది" అని ఫోన్ చేస్తాడు. కానీ అప్పటికే ఆలస్యం అయి- రెడ్ హాండెడ్ గా పట్టుబడిపోతాడు తండ్రి. మనవడిని రోడ్ల మీద వదిలేసినందుకు చివాట్లు పెడ్తాడు తాత.

—అబ్బాయ్ తల్లి దగ్గరికి వెళ్తాడు.

ఎయిర్ పోర్టుకి తల్లి రాలేక, బోయ్ ఫ్రెండ్ తో ఇంపార్టెంట్ పని వుండటం వల్ల ఇంకెవర్నో పంపుతుంది- తల్లి దగ్గిర కూడా అడ్జస్టు కాలేకపోతాడు కొడుకు. అందరూ అతడిని ప్రేమగానే చూస్తారు. పెద్ద పెద్ద హోటల్స్‌లో డిన్నర్లూ, ఈత కొలనులో విహారాలూ, బుల్ ఫైట్లూ,...కానీ

అది కాదు కావల్సింది.

తల్లి బోయ్ ఫ్రెండ్ ని, తండ్రికి పరోక్షంగా పరిచయం చేస్తాడు కొడుకు. తండ్రి గర్ల్ ఫ్రెండ్ కూడా అతడితో మామూలుగానే ప్రేమగా మాట్లాడుతుంది. దే ఆల్ లవ్డ్ హిమ్. అయినా అతడు ఇంటి నుండి వెళ్ళిపోయాడు.

పోలీస్ స్టేషన్‌లో కంప్లెయింట్ ఇవ్వటానికి వెళ్తారు తండ్రీ, పక్కింటాయన. ఇనస్పెక్టరు పక్కింటాయన్ని "ఎందుకింత నిర్లక్ష్యంగా ఆ కుర్రవాడ్ని వదిలేసేవు ?" అని అడుగుతాడు. అవుడు అతడు నిర్లక్ష్యంగా చెప్పినా, ఆ జవాబులో గుండెల్ని జలదరింపజేసే సత్యం వుంది- "...చిన్న పిల్లలు కుందేలు పిల్లల్లాటివారు. చిన్నప్పుడు ఎంతో ముద్దుగా, అందంగా వుంటారు. కొంచెం ముదరగానే, తినటానికి తప్ప ఇంక దేనికీ పనికిరాని ముసురు కుందేల్లా మారతారు. ఉహూ- దానికూడా పనికిరారు- వీళ్ళ మీద ఖర్చు- స్కూల్ కీ, హాస్పిటల్ కీ, బట్టలకీ- అంతటికీ ఖర్చే. పోనీ వీళ్ళమీద ఇంత ఖర్చు పెట్టినా- మన వృద్ధాప్యంలో వీళ్ళు మనని సరీగ్గా చూస్తారన్న నమ్మకం లేదు. వీళ్ళ మీద ప్రేమ పెంచుకోవటం అనవసరం."

ఇనస్పెక్టర్ పక్కింటాయన్ని జైల్లో పెడతాడు !

ఈ చిత్రం ముగింపు కంట నీరు తెప్పిస్తుంది.

-ఒక గొడ్లచావిడిలో దొరుకుతాడు కుర్రవాడు. తల్లీ తండ్రీ, ఇద్దరు తాతలూ, అమ్మమ్మలూ అతడిని ముద్దుల్తో

ముంచెత్తుతారు. తరువాత అతడిని ఎవరి దగ్గిర వుంచుకోవాలన్న ప్రసక్తి మళ్ళీ వస్తుంది. ఒక తాతగారు అనారోగ్యం- ఒక తాతగారు ఆస్ట్రేలియా అర్జెంటుగా వెళ్ళాలి. తల్లీ తండ్రీ వేర్వేరుచోట ఉద్యోగాలు.

ఇంతలో చావిడిలో ఒక మూల ఆవు ఈనుతుంది. "ఎంత అందమైన దూడో" అని అందరూ అటు పరుగెత్తి గుమిగూడతారు రెండు నిముషాల వరకూ పడిన టెన్షనూ, కుర్రవాడు దొరగ్గానే పొందిన ఆనందం... ఈ కొత్త దూడని చూడటంలో అటు మారుతుంది.

—ఒంటరిగా నిలబడిన కుర్రవాడు నెమ్మదిగా కదిలి, దట్టంగా పెరిగిన గడ్డివైపు వెళుతుండగా-చిత్రం ముగుస్తుంది.

ఫ్లాష్‌బ్యాక్‌లు ఎంత అందంగా చూపించవచ్చో, ఎన్నిసార్లు ఫ్లాష్‌బ్యాక్ చూపించినా బోర్ కొట్టకుండా ఎలా మిక్స్ చేయవచ్చో ఈ చిత్రం చూసి మన దర్శకులు నేర్చుకోవచ్చు.

—//—

# మెఫిస్టో

(హంగేరీ)

---

చుట్టూ వున్నవాళ్ళ గుర్తింపుకోసం, చేతిలో సత్తా లేని వాళ్ళు పడే తాపత్రయం జాగ్రత్తగా గమనిస్తే తెలు

స్తుంది. జర్నలిస్టుల చుట్టూ, ఎడిటర్ల చుట్టూ తిరిగి, తమ ప్రదర్శనలకి వాళ్ళని అధ్యక్షులుగా ఆహ్వానించి పబ్లిసిటీ పొందుతూ వుంటారు వీళ్ళు. ఇది మొదటి మెట్టు. తరువాత మెట్టుగా, ప్రముఖుల్ని పట్టుకొని వాళ్ళ పేర్లతో తమని జత చేసుకోవటం ద్వారానూ, వాళ్ళతో పరిచయం పెంచుకోవటం ద్వారానూ కీర్తి శిఖరాలు ఎక్కటానికి ప్రయత్నం చేస్తారు. ప్రతిక్షణమూ ఆత్మవంచన చేసుకునే ఈ వ్యక్తులు, అనుక్షణమూ మనస్సులో ఘర్షణపడుతూనే వుంటారు. చివరికి ఆ శిఖరం మీద నుంచి ఎప్పటికైనా జారిపడక తప్పదు వీరికి.

హెండ్రిక్ హాఫ్‌గెన్ ఒక చిన్న తరహా నటుడు. అతడి ఆశయం ఒకటే...సక్సెస్! దాన్ని సాధించటంకోసం నానా గడ్డీ కరుస్తూ వుంటాడు. ముగ్గురు స్త్రీలని అతడు మెట్లుగా ఉపయోగించుకొంటాడు. ఒక స్త్రీని వివాహ మాడతాడు కూడా. మామగారి సాయంతో మొదటి మెట్టు ఎక్కుతాడు.

గొథే రచనలో మెఫీస్టో పాత్రని అద్భుతంగా పోషించటంతో అందరూ అతడిని "మెఫిస్టో" అని పిలుస్తూ వుంటారు. నిజానికి మెఫిస్టో అతనే! అతడి మొహంలోనూ, మనసులో అనే పరస్పర విరుద్ధ భావాలు వున్నాయి. అతడికి కన్విక్షన్ లేదు. ముందు ఒక విప్లవాత్మకమైన నాటకం ప్రదర్శిస్తాడు. తరువాత జెర్మనీని నాజీలు స్వాధీనపరుచుకొన్నప్పుడు వారికి అనుగుణంగా విప్లవాన్ని నిరసిస్తాడు. జెర్మన్ జనరల్ సలహా మీద భార్యకు విడాకులిచ్చి నాజీల తొత్తుగా జెర్మనీలోనే

వుండిపోతాడు. ప్రతిఫలంగా థియేటర్ చీఫ్ పదవి దొరుకు తుంది. జనరల్ మిస్ట్రెస్ ప్రాపకం సంపాదించి రాయల్ గెస్ట్‌గా ఇంకో మెట్టు పైకివెళ్తాడు. తన పూర్వపు మిత్రుడు, ఒకప్పుడు లెఫ్టిస్టు - అతడికి - ఆశ్రయం ఇవ్వటంకోసం జన రల్‌ని బతిమాలుతాడు. ముందు జనరల్ ఒప్పుకుంటాడు కానీ-ఇక్కడే కథ క్లయిమాక్సుకి చేరుకుంటుంది. అతడి స్నేహి తుడిని తర్వాత సైనికులు "మాయం" చేయటంతో, అతడికి తన స్థానం ఏమిటో తెలుస్తుంది. తన చేతిలో నిజమైన కళ లేదు. తనలో నిజాయితీ లేదు. తనను "పైకి తోస్తున్న" వాళ్ళకి కూడా ఆ విషయం తెలుసు. కానీ వాళ్ళూ, వాళ్ళ స్వార్థంకోసం తనని పావుగా వాడుకొన్నారు—అంతే.

—ఈ నిజం తెలుసుకొన్న తరువాత అతడికి ఒంటరి తనమే మిగిలిపోయింది. అప్పటికే చేతులు కాలిపోయాయి. ఒంటరిగా ఏడుస్తాడు. నలుగురిలో నవ్వుతాడు. జనరల్ అతడిని కార్నర్ చెయ్యటం క్లయిమాక్సు. దాంతో చిత్రం పూర్తి అవుతుంది. నిజానికి ఇది చిత్రం కాదు. ఒక పెద్ద కాన్వాస్‌మీద ఒక వ్యక్తి జీవితపు చిత్ర కల్పన! దర్శకుడు ఎంతో అద్భుతంగా చిత్రీకరించాడు. అర్థం చేసుకుంటే ప్రతీ డైలాగులోనూ కొత్త కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. కీర్తి కండూతి మనిషిని ఎలా దిగజారుస్తుందీ వివరించి చెప్పే ఈ చిత్రం దురదృష్టవశాత్తూ ఎక్కువ మందిని ఆకర్షించ లేక పోయింది.

—||—

# బ్యాడ్ ప్రైమింగ్

(యు. కె.)

---

ప్రస్తుత సమాజంలో యువతీ యువకుల ఆలోచనా సరళి ఎంత క్లిష్ట మవుతూందో తెలియజెప్పే చిత్రం ఇది. సెక్స్-ప్రేమ-ఇష్టం-లాటి పదాలకి అర్థం మారిపోతూంది. వాటిమధ్య తేడా రోజు రోజుకీ తగ్గిపోతుంది. మానసికంగా సరిగ్గా ఎదగని అమ్మాయిలు-ఒకే టైమ్‌లో నలుగురైదుగురు అబ్బాయిలతో పరిచయం ఏర్పర్చుకుని, వారితో శారీరక సంబంధం ఏర్పర్చుకోకుండా కేవలం ముద్దు వరకూ వస్తూ కొంటూ, 'నేను చెడిపోలేదు' అని ఆత్మవంచన చేసుకోవటం మన చుట్టూ వున్న సమాజంలో గమనిస్తూ వుంటాం. 'నేను ఒంటరిదాన్ని' అని మాటిమాటికీ అనుకుంటూ- ఒక్కో అబ్బాయితో పరిచయం అవగానే, ఆ పరిచయాన్ని తన సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌కి ఒక్కో మెట్టుగా భావించుకుంటూ అన్ని మెట్లూ ఎక్కిన తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే, సాధించిందేమిటి ? ఏమీ వుండదు.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను - అని ఒక్కమాట ఎందుకు అనవు ?" అనడుగుతాడు హీరో.

"నన్ను అర్థం చేసుకోవటానికి చేసే ప్రయత్నాలు

తగ్గించి, ఎక్కువ ప్రేమించటానికి ఎందుకు ట్రై చెయ్యవు ?"
అంటుంది హీరోయిను.

ఆమె దృష్టిలో ప్రేమ అంటే సెక్స్. మనవాళ్ళు ముద్దు వరకూ వచ్చి ఆగిపోతే, ఆ అమ్మాయి అమెరికాలో పుట్టింది కాబట్టి పూర్తి సెక్సుకికూడా వచ్చేస్తుంటుంది. మనకి 'యు' సర్టిఫికెట్, 'ఎ' సర్టిఫికెట్ వున్నట్టే-వాళ్ళకి 'ఎక్స్' సర్టిఫికెట్ కూడా వుంది. ఎక్స అంటే పూర్తి సెక్సు చిత్రం. అందుకే ఈ ప్రదర్శన జరిగేటప్పటికి పది నిముషాల ముందే హాలు క్రిక్కిరిసిపోయింది. ఈ చిత్రంలో దాదాపు ఆరు 'మేటింగ్' సీన్‌లు ఉన్నాయి. అందులో ముఖ్యంగా మెట్ల మీద రమించే దృశ్యం ఘోరంగా (ఈ పదం వాడొచ్చా ?) వుంది. అందుకే కాబోలు పది రూపాయల టికెట్టు మూడు వందలకి అమ్ముడుపోయింది.

మిలేనా హుషారైన, అందమైన అమ్మాయి. ఆమెకి చాలా మంది యువకులతో పరిచయం వుంది. జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకొనే ఈ అమ్మాయికి, డాక్టర్ అలెక్సు అనే సైకో అనలిస్ట్‌తో పరిచయం అవుతుంది.

కానీ డాక్టర్ అలెక్స్ పొసెసివ్. సెక్స్, ప్రేమ వేర్వేరు కావనీ, రెండో దానికి మొదటిది పరాకాష్ట అనీ భావిస్తూ వుంటాడు. అతడికి ఆమె వేరొకరితో కలిసి తిరగటం ఇష్టం వుండదు. దాంతో ఇద్దరికీ ఘర్షణ వస్తుంది. ఎప్పుడు గొడవొచ్చినా, చాలా ఘాటైన సెక్సువల్ మేటింగ్‌తో అలసి పోయి, కలిసిపోతూ వుంటారు. (చిత్రం మొత్తానికీ ఈ ఒక్క

నిజాన్నే వాస్తవంగా చూపించగలిగాడు దర్శకుడు.)

మిలేనా ఏ ఒక్క ప్రియుడితోనూ కలకాలం సంబంధం పెట్టుకోదని గ్రహిస్తాడు అలెక్స. ఇది చాలా చేదు నిజం. ఆమె మీద అధికారం సంపాదించటం కోసం తనని వివాహం చేసుకొమ్మంటాడు. అప్పుడామె చెప్పిన సమాధానం ఆమె మనస్తత్వానికి సంబంధించినంత వరకూ చాలా నిజాయితీగా వుంది. "నా జీవితం నాదే అలెక్స. అందులో ఒక భాగానివి నువ్వు. కావాలంటే చాలా పెద్ద భాగంగా వుండు. అంతే" అంటుంది.

చాలా తేలిగ్గా చెప్పిన సమాధానం ఇది. కానీ అంత సులభంగా అయిపోదు. మానసికంగా అప్ సెట్ అయిపోతుంది ఆమె. ఈసారి సెక్స కూడా ఆమెని చల్లార్చదు. ఆత్మహత్య చేసుకోవటం కోసం టాబ్లెట్స వేసుకొంటుంది. చిత్రం చూసిన ప్రేక్షకులికి దర్శకుడు చెప్పదల్చుకున్నదేమో అర్థంకాదు. ప్రతీ మనిషికీ ప్రేమ అవసరం- ప్రేమలేని దగ్గిరతనం (శారీరంగా) మనిషిని ఒంటరిగానే మిగులుస్తుంది, అని చెప్పదల్చుకున్నాడా ? అలా అయితే ఆమెలో మానసిక సంఘర్షణని ఎందుకు చూపించలేదు ? ఈ కన్ఫ్యూజన్ చాలదన్నట్టూ దర్శకుడికి ఎడిటర్ కూడా తోడై అనవసరమైన చోటల్లా ఎక్కడివో ముక్కలు తీసి అతికించి మనల్ని మరింత అయోమయంలో పడేశాడు.

రాత్రి పదింటికి మాత్రలు మింగిన మిలేనాని అలెక్స ఆస్పత్రికి రాత్రి రెండింటికి తీసుకు రావటంతో ఇనస్పెక్టర్ కి

అనుమానం వస్తూంది. అతడు పదింటికే చేరుకున్నాడన్న విషయం, ఆఫ్ చెయ్యని కార్లో ట్రాన్సిస్టర్ ద్వారా నిరూపణ అవుతుంది. ఎందుకంటే ఆ రేడియో స్టేషను అప్పటికే క్లోజ్ అయిపోతుంది కాబట్టి. మరి దాదాపు మూడు గంటలపాటూ అతడు ఆమె ఇంటిలో ఏం చేసేడు ?

చాలా జుగుప్సాకరమయిన క్లయిమాక్సు.

పరోక్షంగా అలెక్సు ఆమె మరణాన్ని కోరుకుంటున్నాడన్న విషయం చెప్పటం కోసం-ఆమెని వెంటనే ఆస్పత్రికి తీసుకురాకుండా అతడు అలక్ష్యంచేసి వుండవచ్చుగాక. కానీ దానికోసం చావటానికి సిద్ధంగా వున్న దానిని మళ్ళీ ఇంకోసారి రమించనక్కర్లేదు.

చెప్పదల్చుకున్న మంచి విషయాన్ని ఎడిటరూ, దర్శకుడూ కలసి ఎంత గొప్పగా పాడు చెయ్యగలరో ఈ చిత్రం నిరూపిస్తుంది.

—//—

## ది మిర్రర్ క్రాక్డ్

(యు. కె.)

---

ఆగాథా క్రిస్టీ నవల ఆధారంగా తీసిన సినిమా ఇది. అభిమానులు తాము అభిమానించే ప్రముఖుల్ని ఎంత ఇబ్బందిలో పడేస్తారో తెలియజేస్తుంది.

ఎలిజబెత్ ఉలర్ మహానటి ఒక చిత్రంలో నటించటం కోసం ఒక పల్లెకు వస్తుంది. దాంతో ఆ పల్లె ఒక్కసారిగా చైతన్యవంత మవుతుంది. ఒకమ్మాయి-ఎలజబెత్ పదిసంవత్స రాల క్రితం ఒక నాటకంలో నటిస్తూవుండగా షేక్ హాండిచ్చి ముద్దు పెట్టుకుని ఆటో గ్రాఫ్ తీసుకున్నది - అక్కడ కథ బడ్తుంది. ఆ అమ్మాయి జీవితంలో అది ఎంత గొప్ప సంఘ టన అంటే, పది సంవత్సరాల క్రితం జరిగిన అ సంఘటనలో ప్రతీ విషయమూ, అంటే ఆ రోజు ఎలిజబెత్ ఏ దుస్తులు వేసుకున్నదీ, ఆ తేది, వగైరా అన్నీ గుర్తు పెట్టుకుంటుంది.

అభిమానులు పెద్ద వాళ్ళతో తమ "చాలా చిన్న పరి చయాన్ని" అలా ఏళ్ళ తరబడి గుర్తుంచుకొని, దాన్ని గంటల తరబడి వర్ణించి చెప్పటం కొత్తకాదు. ఎలిజబెత్ అనా సక్తంగా వింటూవుంటుంది. అంతలో ఆమె దృష్టి ఒక తల్లి, బిడ్డా చిత్రం మీద పడుతుంది. ఆమె స్థాణువు అవుతుంది.

అభిమానికి తన చేతిలో గ్లాసు ఇచ్చి, ఇంకెవరిదగ్గరకో వెళ్తుంది. అభిమాని ఆ గ్లాసులో డ్రింకు తాగి మరణించ టంతో-ఒక్కసారిగా కథ మలుపు తిరుగుతుంది. ఇన్స్పెక్టర్ రంగంలోకి దిగుతాడు.

నిజానికి ఆ ద్రవం ఎలిజబెత్ తాగివుంటే ?

ప్రొడ్యూసరూ (టోవికర్టస్) డైరెక్టర్ (రాక్ హడ్సన్) కూడా కంగారు పడ్తారు. ఈ లోపులో ఎలిజబత్ మీద మరో హత్యా ప్రయత్నం జరుగుతుంది.

ఈ సంఘటనలన్నింటినీ వేరే కోణంలో ఆలోచిస్తుంది మార్పెల్ అనే ఒక ముసలావిడ. ఫోటోని చూస్తూ ఎలిజబత్ ఎందుకు స్థాణువైంది ? కారణం ఏమిటో ఇన్‌స్పెక్టర్ చెబ్తాడు. ఆమెకి వివాహం జరిగి చాలా సంవత్సరాలైనా పిల్లలు పుట్టే అవకాశం లేదు. పుట్టిన ఒక పిల్లవాడూ పురిట్లోనే చనిపోతాడు. ఆమెకి "జర్మన్ మీజిల్స్" అన్న ఒక అంటువ్యాధి సోకగా జరిగిన దారుణ ఫలితం ఇది.

ఒకటీ—ఒకటీ కలిపి ఆలోచిస్తే ఆ ముసలామెకు మొత్తం కథ అంతా బోధ పడ్తుంది.

పది సంవత్సరాల క్రితం అభిమాని, ఆనందం పట్టలేక ముద్దు పెట్టుకున్నప్పుడు అంటుకున్న "జెర్మన్ మీజిల్స్-" ఎలిజబెత్ గర్భాన్ని విచ్ఛిన్నం చేసింది. మాటిమాటికి చేతి రుమాలు అడ్డుపెట్టుకుని తుమ్ముతూ వుండే అభిమాని పది సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన చెప్పగానే ఎలిజబెత్ కి- తన చనిపోయిన బిడ్డ గుర్తొస్తుంది. దీని కంతటికీ కారణం ఆమె ముద్దే ! అంటు వ్యాధి అని కూడా జాగ్రత్త వహించకుండా, తను తల్లి అయ్యే అవకాశాన్ని పూర్తిగా నాశనం చేసింది ఆ అభిమాని !

తల్లీబిడ్డా ఫోటో చూడగానే ఆమె ఫ్రీజ్ అయింది అందుకే ! ఆనందంతో గడగడా మాట్లాడే అభిమాని మీద పగతీర్చుకోవాలనుకుంటుంది. పక్క-కెళ్ళి తన గ్లాసులో విషం కలిపి తీసుకొచ్చి అభిమానికిస్తుంది. అందరూ ఆ గ్లాసు ఎలిజబెత్ ని చంపడానికి వాడింది అనుకుంటారేగానీ, అభి

మానికోసం అనుకోరు.

ఈ చిత్రంలో సస్పెన్స్ అంతగా లేదు. కానీ, చాలా కాలం తరువాత ఒకే స్క్రీన్ మీద కనబడిన పెద్ద పెద్ద తారలు తమ అభిమానుల్ని సంతోష పెట్టారు. "ఎయిర్ పోర్టు"లో అస్కార్డు బహుమతి పొందిన అంగెలా లాన్స్‌బరీ ఈ చిత్రంలో ముసలామెగా మంచి నటన ప్రదర్శించింది.

"ప్రొడ్యూసరా ? డైరెక్టరా ? ఎవరు—హీరోయిన్ని సెలెక్టు చేస్తారు...?" అని అభిమాని అమాయకంగా అడిగిన ప్రశ్నకు "ఎవరు ముందు పడుకుంటే వాళ్ళు" అన్న జవాబు—"డైరెక్టర్‌కీ ప్రొడ్యూసర్‌కీ తేడా ఏమిటి" అన్న ప్రశ్నకి, "డబ్బు ఖర్చు పెట్టేవాడు ప్రొడ్యూసరు - దాంతో ఖ్యాతి కొనుక్కునేవాడు డైరెక్టరూ" అన్న జవాబు ప్రేక్షకుల్ని [చాలా మంది చిత్రరంగానికి సంబంధించిన వారే కాబట్టి] ఇబ్బందిలో పడేస్తుంది. ఇలాంటి సెటైర్లు చాలా వున్నాయి ఈ చిత్రంలో...

—||—

## అనిమా
(ఆస్ట్రియా)

---

ఫిల్మోత్సవ్-82లో ప్రదర్శించబడిన అన్ని చిత్రాల్లోకీ అత్యున్నతమైనదిగా ప్రేక్షకులచేత కొనియాడబడిందీ చిత్రం. ఇందులో కథ అంటూ ఏమీ లేదు. ఒక ఫాంటసీ-సింఫోనీ

...ప్రతి ఫ్రేములోనూ అందమైన రంగుల మేళవింపు, ప్రేక్షకుడి మూడ్ కి అనుగుణంగా మారే రంగులూ, వెనుకే వాద్య సంగీతం మనల్ని వేరే ప్రపంచంలోకి తీసుకెళతాయి. అయితే ఇది సంతోషకరమైన అనుభవం కాదు. ప్రతీ క్షణమూ దర్శకుడు తను ఎన్నుకున్న సమస్యతో మనల్ని ఆలోచింప చేస్తూనే వుంటాడు.

దర్శకుడుగానీ, రచయితగానీ మత ప్రవక్తలు కారు. సమస్యల్ని కాన్వాస్ మీద చూపించటంవరకే వారి బాధ్యత. ముగింపులో పరిష్కారం చెబితే మంచిదే! కానీ ప్రేక్షకుల ఆలోచనలకే వదిలి వెయ్యటం మంచిది. అప్పుడు అది రిస్ట్రిక్టు అవదు. ఇదో పద్ధతి.

—ఒకప్పుడు ప్రాణుల్లో స్త్రీ - పురుష భేదం లేదు. ఒకటే సెక్సు. ఇప్పటికీ ప్రోటోజోవా సంతతి యూనిసెక్సే. అయితే ఇక్కడ దర్శకుడు చెప్పే కొత్త థియరీ ఏమిటంటే, కేవలం 'మనిషి' మీద కోపం వచ్చి దేముడు ఆ ప్రాణిని రెండుగా విడగొట్టాడని!

'అనిమా' అన్న పదం-ఒక సంపూర్ణత్వాన్ని ఆపాదించుకొన్న ఊహాజనితమైన స్త్రీకి ఆపాదించబడింది. ఆమె తల్లికావొచ్చు, ప్రేయసికావొచ్చు, వ్యభిచారిణికావొచ్చు! యోగినీ-మంత్రగత్తె కావొచ్చు.

స్త్రీ విమోచనని మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచిస్తూ ఈ మధ్య తెలుగులో కూడా కొన్ని రచనలు వస్తున్నాయి. ఈ చిత్రంలో అలాటి పారిశ్రామిక విప్లవాన్ని-స్త్రీ విమోచ

వని మిళితం చేస్తూ దర్శకుడు రూపకల్పన చేసేడు.

విజువల్ ఎక్స్‌ప్రెషన్ అంటే ఏమిటో యీ చిత్రం చూస్తే తెలుస్తుంది.

ఒక పెద్ద కార్ఖానాలో పెద్ద పెద్ద బాయిలర్సగా స్త్రీలని ముడి పదార్థాలుగా పడేసి, అందమైన బొమ్మలు తయారు చేస్తూ ఉంటారు. ఒక పెద్ద కుట్టుమిషన్ [పై భాగం స్త్రీ] అదే పనిగా కుట్టుతూ వుంటుంది. ఈ మిషన్ సమాజానికి ప్రతీక. ఎంతో అపురూపంగా చూసుకోవలసిన స్త్రీని, తన స్వార్థంకోసం పురుషుడు ఒక మిషన్‌గావాడుకుంటున్నాడు... ఏ పొత్తి కడుపులో తన అకృతి ప్రాణంపోసుకుందో, ఆ కడుపునే తిరిగి కోరుతున్నాడు. స్త్రీ రొమ్ముని బ్రెడ్ చేసుకొని తింటున్నాడు. స్త్రీని–పురుషుడినీ క్షణక్షణానికీ వేరుచేస్తున్న గడియారం పెండ్యూలం కొద్దికొద్దిగా క్రిందికి దిగిపోతూంది. కేవలం సెక్సే వాళ్ళని కలిపి వుంచగల్గుతూంది.

ఈ చిత్రంలో దర్శకుడు వాడుకున్న సింబాలిక్ షాట్స్, క్లైమాక్స్ వరకూ తీసుకెళ్ళకుండా సీనుని వదిలెయ్యటం–వీటిలో అతడి ఉద్దేశం బహుశా ప్రేక్షకుల్ని తమ ఆలోచనకి అందినంతవరకూ ఆలోచించుకొమ్మని కాబోలు! రాతి సైనికుడి కళ్ళలో నీళ్ళు - జీవితం ఒక మంచి మాస్టల్ బేషన్ అన్న వాక్యం - సమాధిమీద అడే చదరంగం - అమ్మాయి బొమ్మమీద యువకులు తీసే బస్కీలు...ఇలాంటి సింబాలిక్ షాట్‌లు చిత్రంలో చాలా వున్నాయి.

రవీంద్ర సదన్‌లో ఈ చిత్రం ప్రదర్శింపబడుతున్న

ప్పుడు — వేరే థియేటర్‌లో యు. యస్. ఎ. చిత్రం వుండటంతో చాలా మంది అటు వెళ్ళి, తరువాత నిరాశపొందారు. నిర్వాహకులు ఇలాటి విషయాల్లో కొద్ది జాగ్రత్త తీసుకుని వుంటే బావుండేది. పెన్‌టార్చ్ పెట్టుకుని, చిత్రం జరుగుతున్నంతసేపూ నోట్సు వ్రాసుకునే మా లాటి సమీక్షకులందరూ ఈ చిత్రం జరుగుతున్నప్పుడు కనీసం కళ్ళు కూడా కదల్చలేకపోయారు.

ఈ చిత్ర దర్శకుడు లీటస్‌లేబర్. ఈ చిత్రం 1981 కేన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శింపబడింది.

—||—

# ది ఫ్రోజెన్ హార్ట్
(స్విట్జర్లాండ్)

మానవత్వంమీద డబ్బు ప్రభావం ఎంత వుంటుందో చెప్పే చిత్రం ఇది. కథ చాలా గమ్మత్తయినది.

ఆల్ప్స పర్వతాల నిండా మంచు దట్టంగా పేరుకొని వుంది. చలి గాలులు ఉధృతంగా వీస్తున్నాయి. ఎక్కడ చూసినా తెల్లటి తెలుపే. పచ్చటి ఓక్ వృక్షాల అంచుల మీద కూడా మంచే!!

స్విట్జర్లాండు ... ఆ కొండల మధ్య రెండు చిన్న గ్రామాలు, వోర్టెరూ ... హింటేరూ అని. ఆ రెండు

గ్రామాల మధ్య మంచులో కూరుకుపోయిన చెట్ల అడవి. బైట ప్రపంచంతో సంబధాలు తెంపేసేటంతగా చలిగాలి!

గొంతు వరకూ తాగేసి- బైట గాలిలోకి వచ్చిన ఒక అనామకుడు దారితప్పి కొండలోయల్లోకి జారిపోతాడు.

అతని హార్టు ఫ్రీజ్ అవుతుంది.

అక్కణ్ణుంచీ అసలు కథ మొదలవుతుంది.

చనిపోయిన వ్యక్తిని మొదట చూసింది ఒక ముసలి వడ్రంగి. అతడు హింటేరు వెళ్ళి ఆ విషయం గ్రామస్తులకి చెప్తాడు. ఎవరు చనిపోనయినా శవ పేటికలో పెట్టి అంత్య క్రియలు జరపడం కనీస ధర్మం. కానీ ఆ ఖర్చులు ఎవరు భరిస్తారు? ఆ గ్రామపు మేయరే భరించాలి.

మేయరు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టవుతుంది.

వడ్రంగితో కలిసి ఆ శవం వున్న ప్రదేశానికి వెళ్తాడు. రెండు గ్రామాలకీ మధ్యవున్న బోర్డరు దగ్గిర పడి వుంటుంది శవం. చలికి అప్పటికే గడ్డకట్టుకుపోయి (హాట్సాఫ్ టు ది కెమేరా. అర్టుడైరెక్టర్) వుంటుంది శవం. శవాన్ని బోర్డరుకి అటువైపు పడేసి, అవతలి వూరి మేయరుకి ఏమీ ఎరగనట్టూ అదే వడ్రంగిచేత కబురు పంపిస్తాడు ఈ మేయరు-అయిదు ఫ్రాంకులు లంచం ఇచ్చి.

అవతలి వూరు మేయరు ఇంకా తెలివైనవాడు. వడ్రంగికి అయిదు ఫ్రాంకులు లంచం ఇవ్వటమేకాక, మందు కూడా కొట్టించి-తిరిగి శవాన్ని అటువైపే పారెయ్యమంటాడు.

వ్రడంగికి వళ్ళు మండుతుంది.

శవాన్ని తిరిగి హింటేరూ తీసుకొచ్చి పడేసి—వెళ్ళి పనీ ఎరగనట్టూ వూరుకుంటాడు. మేయరుకి ఇక తప్పదు. గొయ్యితీసే కార్యక్రమాలు అప్పచెప్పి, స్లెట్టిమీద శవాన్ని తీసుకురావడంకోసం మనుష్యుల్ని పంపుతాడు. శవాన్ని స్లెట్టి మీదకు ఎక్కిస్తూ వుండగా ఒక ఉత్తరం దొరుకుతుంది. అది చచ్చినవాడి విల్లు. ఆ విల్లుతో పాటూ ఒక సీలు వేసిన కవరు వుంటుంది. ఆ ఉత్తరములో తనే వూరిలో చనిపోతే ఆ వూరు అధికారులకీ, చర్చి పూజరికీ ఆ కవర్‌లో వున్న పెయ్యి ఫ్రాంకుల డబ్బు అందజేయమని వ్రాసి వుంటుంది. ఆ కవరు సీలు ఆ రాత్రికి విప్పాలనీ, అంతకు ముందు తన పేరు మీద సంతర్పణ జరగాలనీ వ్రాసి వుంటుంది.

కొద్దిలో జారిపోయే అదృష్టం తిరిగి దక్కినందుకు ఆనందంతో తల మునకలవుతారు ప్రీస్టూ, మేయరూ శవం అత్యంత వైభవంగా సంస్కారం చెయ్యబడ్తుంది. ఊరంతటికీ బ్రహ్మాండమైన విందు ఇవ్వబడ్తుంది. ఈ హడావుడిలో, కవరు విప్పిన నత్తి నౌకరు ఆ కవర్‌లో వున్నది ఖాళీ కాగితం అని తెలుసుకొని, నత్తి నోరూ బాదుకొని చెప్పబోయినా ఎవరూ వినరు.

చివరికి ఉత్తరం విప్పే క్షణం వస్తుంది. ఖాళీ కవరు గమనించి మేయరు చిందులు తొక్కుతాడు. ప్రీస్టు పిచ్చెక్కి పోతాడు. అప్పటికే వ్రడంగి ఆ వూరి పొలిమేరలు దాటేసి వుంటాడు.

సినిమా ప్రారంభం అయినదగ్గర్నుంచీ కడుపు పట్టుకొని నవ్విన జనం, ఇక చివరికొచ్చే సరికి నవ్వలేక కుర్చీల వెనక్కి జారబడిపోయినా, ఈ హాస్యం వెనుక వున్న మానవత్వపు విలువల్ని ప్రశ్నించే సెటైర్ ని అందరూ గమనించారు. కెమెరా వర్క్ అత్యున్నతంగా వుండి, చిత్రాన్ని చూస్తున్నంతసేపు స్విట్జర్లాండ్ లో వున్నట్టే భ్రాంతికల్గించింది. పత్తి నౌకరు వేషం వేసిన నటుడి నటన రేయాన్స్ డాటర్ లో ఒక పాత్రని గుర్తుకు తెస్తుంది.

—//—

# సిస్టర్స్
(జెర్మనీ ఫిల్మ్)

---

మనస్తత్వ విశ్లేషణని గొప్పగా చిత్రించిన చిత్రం ఇది. మనం మన దగ్గరవాళ్ళపట్ల, ఆత్మీయులపట్ల అనుసరిస్తున్న విధానం, చూపిస్తున్న ప్రేమ, చెలాయిస్తున్న అధికారం చాలా గొప్పదని మనం అనుకోవచ్చు. కానీ అవతల వాళ్ళకి అది చాలా ఇబ్బందికరంగా తయారవచ్చు. వాళ్ళు దాన్ని వెల్లడించకపోతే, అది చాలా విషమ పరిస్థితికి దారి తీయవచ్చు కూడా.

మారియా, అన్నా అక్కా చెల్లెళ్ళు. మారియా

స్వశక్తితో జీవితంలో పైకి వచ్చింది. ఒక పెద్ద కంపెనీలో హోదావున్న చీఫ్ సెక్రటరీ. చెల్లెలు ఇంకా చదువు కుంటూంది. ఆ ఇంట్లో వాళ్ళిద్దరే. ఒకరంటే ఒకరికి అంతులేని అభిమానం. చెల్లెలికి అక్కని చూస్తే వర్షిప్ ! అక్క ఒక మహావ్యక్తి అని భావిస్తూ వుంటుంది.

తన చెల్లెలు తనంత అవ్వాలని మారియా కోర్కె. బాగా చదవ మంటుంది. బాగా చదవాలి...చదవాలి అన్న కోర్కెతో, జీవితంలో అక్కలా అవ్వలేనేమో నన్న భయంతో అన్నా డిప్రెస్ట్‌గా మారిపోతూ - తనలో తనే కుమిలిపోతూ ఇంట్రావర్టు అయిపోతుంది. డైరీలో విపరీత మైన భావాలున్న ఫోటోలు అతికించుకోవటం, కోడ్‌లో తన భయాలు వ్రాసుకోవటం చేస్తుంది. చివరికి ఒకరోజు, అక్క ఆఫీసు నుంచి ఇంటికొచ్చే సరికి, కుడిచెయ్యి మణికట్టు దగ్గర నరాన్ని కోసుకుని ఆత్మహత్య చేసుకొంటుంది.

మారియాకి ఇది భరించలేని షాకు ! దాన్ని తట్టుకోవ టం కోసం మరియం అనే ఇంకో అమ్మాయి తన ఆఫీసులోనే చిన్న టైపిస్టుని తన ఇంటికొచ్చి వుండమంటుంది. మరియం జాలీటైపు అమ్మాయి. హుషారుగా కుర్రాళ్ళతో తిరిగే స్వభావం కలది. వాళ్ళిద్దరికీ చాలా కొద్దిరోజుల్లోనే సంబంధాలు చెడిపోతాయి. జీవితానికి ఒక ఆశయం వుండాలనీ, ఆ గమ్యం సాధించటం కోసం కృషి చెయ్యాలనీ మారియా అంటుంది. అప్పటికే ఆ ఇంటితోనూ, మారియాతోనూ విసిగిపోయిన ఆ అమ్మాయి—

"నువ్వో సాడిస్టువి. జీవితంలో ఏమీ అనుభవించలేక కేవలం ఉద్యోగపు కెరీర్‌లో సాధించిన విజయానికే ఆశయం అని పేరుపెట్టుకుని, నీ కన్నా చిన్నవాళ్ళనీ, హుషారుగా తిరిగేవాళ్ళనీ చూసి ఓర్వలేక, వాళ్ళమీద నీకున్న అధికారంతో ఇన్‌డైరెక్టుగా హింస పెట్టి ఆనందించే స్వభావం నీది" అని దులిపేసి ఆ ఇంటి నుంచి వెళ్ళిపోతుంది.

మారియాకి తన తప్పు తెలుస్తుంది.

"మా రోజుల్లో ఇలా అర్థరాత్రి వరకూ వీధుల్లో తిరిగి ఇంటికొచ్చే వాళ్ళం కాదురా. పెద్దలంటే భక్తిశ్రద్ధ లుండేవి" అని మందలించే ఇంటి పెద్దలు చూడవలసిన చిత్రం ఇది. సంభాషణలు కొద్దిగా బోరు. సిస్టర్స్ స్కేల్స్ ఆఫ్ హాపీనెస్ అన్న పేరుచూసి సెక్సుకోసం ఎగబడిన ప్రేక్షకులు నిరాశ చెందుతారు.

—//—

# కాన్‌స్టన్స్

(పోలిష్ ఫిల్మ్)

---

మనిషి ఆలోచనల గురించీ, జీవితపు దృక్పథం గురించీ, లోతుగా వెళ్ళి చెప్పే సినిమాలు మనకు చాలా తక్కువ. తెలుగులో అయితే అసల్లేవు. పోలిష్ చిత్రం "కాన్‌స్టన్స్" ఆ కోవలోకి చెందింది.

వైటోల్డు చాలా సాధారణమైన వ్యక్తి. అయితే, మంచితనంపట్ల నిర్దుష్టమైన అభిప్రాయం కలవాడు. అతడు ఒక చిన్న ఉద్యోగి. తన బాస్ పైకి కనబడేటంత పెద్దమనిషి కాదని గ్రహిస్తాడు.

పర్వతారోహణ వైటోల్డు అభిరుచి. హిమాలయాల్ని అధిరోహించటం అనేది అతడి జీవితాశయం. కానీ జీవితంలో ఒక స్థాయిని ఆరోహించటానికి అతడి నీతినియమాలు ఎప్పుడూ అడ్డుపడ్తూ వుంటాయి. ఎప్పటికైనా ఒక చిన్న ఇల్లు కొనుక్కోవాలన్న కోర్కకూడా తీరని కోర్కగా మిగిలి పోతుంది.

ఉద్యోగం పనిమీద అతడు భారతదేశం వస్తాడు. ఇక్కడ వున్న బీదరికాన్ని, ఆ బీదరికాన్ని కాష్ చేసుకోవా లనుకునే కపట బాబాల్నీ చూసి విరక్తి చెందుతాడు. అతడు తిరిగి తన దేశానికి వచ్చేటప్పటికి అతడి తల్లి ఆస్పత్రిలో చావు బ్రతుకులమధ్య వుంటుంది. తల్లిని డాక్టర్లు సరిగ్గా చూడాలంటే డబ్బు కావాలి.

—తల్లిని ఇంటికి తీసుకువచ్చేస్తాడు. ఆ తల్లి మరణి స్తుంది.

—నిరాశనుంచి ఒంటరితనంలోకి వెళ్ళిపోతాడు వైటోల్డు. అయితే ఆ ఒంటరితనం వేదాంత పరమైనది కాదు. అతడి నిర్వేదన వేదనలోంచి పుట్టింది. తల్లి సమాధిమీద పాకే వానపాము-జొంబాయిలో మురిక్కాలవ పక్కన వణుకుతూ పడుకున్న చంటిపిల్లాడు-ప్రపంచం అంటే అతడికి రోత

వుద్దుంది. (వైటోల్డు నిస్పృహా చెందినప్పుడల్లా పర్వతాగ్రాల నుంచి తాళ్ళు పట్టుకొని వేలాడుచున్న దృశ్యాన్ని అతడు వూహించుకుంటూ వుంటాడు.)

డబ్బు మనిషికి ఇంత ఆశ కలిగిస్తుందా అనుకుంటాడు. పైనుంచి చిల్లర నాణేలు క్రిందకి జార్చి, చాలా పెద్ద మనుష్యులూ, మర్యాదస్తులూ కూడా వాటిని ఏరుకోవటం గమనించి ఆనందాన్ని పొందుతూ వుంటాడు.

అతడు పనిచేస్తున్న ఆఫీసు నరకంగా మారుతుంది. యజమాని డబ్బు సంపాదనే ముఖ్యంగా పెట్టుకున్న జలగలాగ కనపడ్తాడు. అతడి అరాచకాన్ని అరికట్టటం కోసం, అతడు యూనియన్ లీడర్లని సంప్రతిస్తాడు. అయితే చాలా ఆశ్చర్యంగా, యూనియన్ లీడర్లు అతడి మాటకి విలువ నివ్వరు. తమ కళ్ళ ముందు జరుగుతున్న ఘోరాన్ని చూసి కూడా ఈ మనుష్యులు, ఈ 'టాక్సు-పేయర్లు' అంత నిర్లిప్తంగా వుండిపోవటం అతడికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. తనే యజమానితో ఘర్షణపడి- ఆ ఘర్షణని టేప్ చేస్తాడు.

ఇంటికొచ్చాక మళ్ళీ నిర్వేదం. "నువ్వు ఎంత పవిత్రంగా వున్నావో, అంతకన్నా ఎక్కువ పవిత్రంగా కనపడటానికి ప్రయత్నం చేస్తావు" అన్న యూనియన్ లీడర్ మాటలు జ్ఞాపకం వచ్చి టేప్ నలిపి పారేస్తాడు.

వైటోల్డుకి ఒక స్నేహితుడు వుంటాడు. అతడూ మంచివాడే! యువకుడు. కానీ జీవితాన్ని చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటాడు. బాగా పలుకుబడి వున్న ఒక అధికారి

కూతుర్ని ప్రేమించి పెళ్ళాడి జీవితంలో ఒక స్థానాన్ని సంపాదించటానికి సోపానాన్ని నిర్మించుకుంటాడు.

-జీవితపు పర్వతాన్ని అధిరోహించటం ఎంత సులభం- కానీ ఇంకోవైపునుంచి ఆలోచిస్తే ఎంత కష్టం ! !

వైటోల్డు అదే మూడ్ లో ఒక ఉపన్యాసం వినటానికి వెళ్తాడు. ఆ లెక్చర్ ఇస్తున్నది ఒక లెక్కల ప్రొఫెసర్. ఏన్=డబ్ల్యూ అని చాలా పెద్ద ఈక్వేషన్ వేసి నిరూపిస్తాడు ఆ ప్రొఫెసర్. వైటోల్డు అడుగుతాడు-అతడిని ఇదే లెక్కని ఇంకోరకంగా చాలా సులభంగా చెయ్యొచ్చు కదా అని, చేసి చూపిస్తాడు "అది బండ పద్ధతి. చాలా సులభమైంది. కానీ నేను చూపించింది సైంటిఫిక్ వే !" ఈ సంఘటన దర్శకుడి సింబాలిజాన్ని చూపిస్తుంది. అడ్డదార్లు ఎప్పుడూ వుంటాయి. కాని నైతిక విలువలు మనిషిని ఆ దారిన వెళ్ళనివ్వవు.

చివరికి వైటోల్డు కోర్కె నెరవేరే రోజు వస్తుంది. అతడు ఇండియా వెళ్ళటానికి అతడి కంపెనీ పచ్చుకొంటుంది. కానీ విమానాశ్రయంలో అతడి కోటులో కొన్ని డాలర్లు దొరుకుతాయి. అవి అతడి ఆఫీసులో దొంగతనం చేయబడ్డవి ! యజమాని అతడిమీద చాలా స్వీట్ గా పగ తీర్చుకున్నాడు !

చాలా సింబాలిక్ గా మనిషి ఆశనీ, ఆశయాన్నీ, వ్యవస్థలో గెలుపునీ, ఓటమినీ చూపించిన చిత్రం ఇది. చాలా సులభంగా డబ్బు సంపాదించగలిగే పరిస్థితిలో వుండీ, రోజుకి

పదహారు గంటలు కష్టపడేవాళ్ళ జీవితపు పంథాకి దర్పణం పట్టే చిత్రం- "కాన్‌స్టన్స్"

—//—

## ది ఇన్సిడెంట్

(జపనీస్ ఫిల్మ్)

మరణించినవాళ్ళు ఎప్పుడూ మంచి వాళ్ళే ! ఆ మరణానికి కారకులయినవాళ్ళని ఘోరంగా శిక్షించాలంటుందీలోకం. కానీ ఆ మరణించిన వ్యక్తి ప్రవర్తన, గుణం ఎటువంటిది ? ఏ పరిస్థితుల్లో ఆ మరణం సంభవించిందీ లోతుగా వెళ్ళి ఆలోచించరు. అందులోనూ చనిపోయింది ఇరవై మూడేళ్ళ అమ్మాయి ! !

హిరోషి అనే యువకుడ్ని కోర్టులో ప్రవేశపెట్టగానే జనం అంతా అతడి మొహంమీద ఉమ్మి వేయటానికి తయారవుతారు. సకాయ్ అన్న అమ్మాయిని చంపినందుకు అతడి మీద నేరం ఆపాదించబడుతుంది. అతడు కూడా, తనే ఆ నేరం చేశానని ఒప్పుకుంటాడు. అతడు తృప్తితో పాడుస్తూ వుండగా ఒక వ్యక్తి చూసేడు కూడా. ఇక కోర్టు శిక్ష వేయటమే తరువాయి.

కానీ హిరోషి ఎందుకు ఆమె మరణానికి కారణభూతుడయ్యాడు అన్నది కోర్టులో తెలుస్తుంది. కోర్టున్న అన్ని

సినిమాల్లోలాగే ఇందులో కూడా ఫ్లాష్ బ్యాక్‌లో... వాద ప్రతివాదనలు మొదలౌతాయి.

నకాయ్, యొషికో అక్కా చెల్లెళ్ళు. ముద్దాయి చెల్లెల్ని ప్రేమిస్తాడు. వాళ్ళిద్దరిదీ అందమైన జంట. తొందరలోనే పెళ్ళి చేసుకోవాలనుకుంటారు కూడా! వాళ్ళ ప్రేమ, ఆ లాలిత్యం అక్కయ్య అయిన నకాయ్‌కి దుర్భరంగా వుంటుంది. ఆమె అప్పటికే ఒకసారి ప్రేమలోపడి మోసపోయింది. అయితే అది ప్రేమ కాదు. సెక్స్! ఆమె నడిపే బార్‌ని రక్షించే ఒక రౌడీలాంటి వ్యక్తితో సెక్స్‌తో కూడిన కలయిక అది. ప్రేమ కాదని తెలుసుకునే సమయానికి చెల్లెలూ హీరోషీలా జంట కళ్ళబడుతుంది. ఆమె కూడా హీరోషిని ప్రేమిస్తుంది. అయితే ప్రేమలో అంతకు ముందే అనుభవం వుంది కాబట్టి, జాగ్రత్తగా అతడిని టెంప్ట్ చేస్తుంది. ఆవేశాన్ని అణుచుకోలేక, ఆమెని అనుభవిస్తాడు అతడు. దాంతో చెల్లెల్ని వదిలెయ్యమని సాధించటం మొదలు పెడుతుంది. యొషీకోని తప్ప మరెవర్నీ ప్రేమించలేననీ, ఆమెనే పెళ్ళాడతాననీ అంటాడు అతడు. "అయితే మరి నాతో ఎందుకు రొమాన్స్ జరిపావు?" అంటుంది నకాయ్. అతడు ఆశ్చర్యపోతాడు-రొమాన్స్‌కి దారి తీసే పరిస్థితులు కల్పించిన ఆమే అలా ప్లేటు తిప్పేసరికి!... ఆమెతో వాదించటానికి అతడికి ఆధారాలు లేవు. ఆ సాయంత్రం పూరిబైట కొండమీద కల్సుకుందాం అంటాడు.

అక్కడ మళ్ళీ వాగ్వివాదం జరుగుతుంది. "నా మీద

నీకున్నది ప్రేమా! ఇష్టమా?? నన్ను భార్యగా కాక పోయినా కనీసం ప్రేమికురాలిగానైనా స్వీకరించు, నన్ను దగ్గరగా తీసుకో..." అంటుంది. ఆమె ప్రవర్తనకి విసిగి పోయిన అతడు–నువ్వంటే అసహ్యం–అంటాడు. ఆమె విసురుగా దగ్గరకి రాబోతుంది. అతడు భయంతో కత్తి తీస్తాడు. ఆమె అడుగుదూరంలోకి వచ్చి ఆగిపోతుంది.

అక్కడ ఆమె ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఒక్క సారిగా కళ్ళల్లో భావం మారిపోతుంది. ఎంత నిజమైన ప్రేమికుడు ఇతడు. కేవలం నోటిమాటగా 'నిన్ను ప్రేమిస్తున్నాను' అంటే చాలు, కాళ్ళముందు పడివుండే తనని, కాబోయే భార్యకోసం కాదంటున్నాడు. ప్రేమలో ఇంత నిజాయితీని ఆమె భరించలేకపోతుంది. తను అప్పటి వరకూ ప్రేమ పేరుతో అనుభవించింది ఎంత నికృష్టమో అర్థమవుతుంది. ఒక్కసారిగా కళ్ళనీళ్ళతో ముందుకొచ్చి అతడిని హత్తుకు పోతుంది! అతడు కత్తి అలాగే పట్టుకొని వుండటంతో - అది ఆమె గుండెల్లో కడుపులో గుచ్చుకుని మరణిస్తుంది.

వాదనలూ ప్రతివాదనలూ విన్న తర్వాత జడ్జికొచ్చిన సమస్య చాలా అపురూపమైనది. ఆమె మరణం యాదృచ్ఛికమా–చెయ్యాలని చేసిందా? ఆమె దగ్గిరికి వస్తున్న హీరో కత్తి పక్కకి తీసేసి వుండాల్సింది. అలా చెయ్యలేదని ప్రాసిక్యూషన్ వాదన. ఇది ఆక్సిడెంటల్ అని డిఫెన్సు వాదన.

చివరికి జడ్జీ ఒక నిర్ణయానికి వస్తాడు. అది ఎటువంటి మరణమైనా, అతడు వెంటనే పోలీసులకి తెలియబర్చ లేదు. కాబట్టి—అది నేరం క్రింద మూడు సంవత్సరాలు శిక్ష విధిస్తాడు. అతడి సిన్సియారిటీ తెలిసిన యెషికో అతడు బైటకి వచ్చే రోజుకోసం ఎదురుచూస్తూ వుంటుంది. దాంతో చిత్రం పూర్తి అవుతుంది.

జైల్లో హిరోషి అనే మాటలు మనల్ని ఆలోచింప చేస్తాయి.

"...నేను నిజంగా తప్పు చేశానా? చేసేనేమో! ఆమె కొద్దిగా ఎంప్ట్ చేసి వుండవచ్చుగాక! నేను కంట్రోల్ చేసుకొని వుండాల్సింది. ఆమెకి ఇంకొకరితో అంతకుముందే శారీరక సంబంధం వుంది. అయినా నన్ను ప్రేమించిందేమో! నేను నిజంగా కత్తి పక్కకి తీసేయ్యాలనుకుంటే తీసెయ్య గలిగి వుండేవాణ్ణేమో...!" అని అంటాడు.

చాలామంది ఈ చిత్రాన్ని మొదటినుంచీ చివరివరకూ కుర్చీ అంచుల్లో కూర్చొని చూసేరు. ఇందులో హిరోషీ విలనా—హీరోనా అన్నది ఈ సమీక్షకుడి జడ్జిమెంట్ కి అందలేదు ఇప్పటికూడా!

—//—

# అవలాంచి

అవలాంచీ అంటే హిమపాతం అని అర్థం. బల్గేరియా చిత్రం ఇది. హిమవన్నగాలమీద ఏ చిన్న కదలిక వచ్చినా పైన పేరుకున్న మంచు అంతా జలపాతంలా క్రిందికి జారి పోతుంది. ఆ పాతానికి మనుష్యులూ, జంతువులూ సమిధలు కావల్సిందే. చాలా అద్భుతమైన ఫొటోగ్రఫీ ఈ చిత్రంలో వుంది. అయితే దీనికన్నా గొప్పది - ఈ చిత్రం ద్వారా దర్శకుడు ఇవ్వదల్చుకున్న సందేశం. రోమను కాలంలో కత్తి యుద్ధాలు చేసి ఆ ప్రదర్శనలో ఒకరినొకరు చంపుకోవటాన్ని ఈ రోజు మనం నిరసిస్తున్నాం. ప్రజలు ఆ ప్రదర్శనల్ని విరగబడి చూసేవారట-అంటే వారి సాడిజానికి విస్తుబోతున్నాం. కానీ మనం చేస్తున్నదేమిటి—బుల్ ఫైట్లు, బాక్సింగ్ పోటీలు, పర్వతారోహణ.

ఈ పర్వతారోహణవల్ల మనిషి సాధించిందేమిటి? తన అహం సంతృప్తి పర్చుకోవటమేగా! దీనివల్ల ఎంత ఖర్చు! అపాయంలో ఇరుక్కుంటే హెలికాప్టర్లు, డాక్టర్లు, కుటుంబ అంతా దుఃఖం. థ్రిల్ కావాలంటే ఇంకా వేరే మార్గమే లేదా? ఈ రకపు గేమ్స్‌ని ప్రభుత్వాలు ఎందుకు బ్యాన్ చెయ్యవు?

చాలా మంచి కథ ఇది. ఈ రకం ప్రోబ్లమ్‌ని ఎవరైనా తెలుగులో థీమ్‌గా తీసుకొని వ్రాస్తే బావుంటుంది.

కొంతమంది పర్వతారోహకులు బయలుదేరటంతో ప్రారంభం అయ్యే ఈ చిత్రం - మంచులో ఇరుక్కుపోయి ప్రాణాలుపోయే ఆఖరి నిముషంలో ప్రతి ఒక్కరూ తమతమ గతం, తమ హితులు, తమ అనుభవాలూ గుర్తు తెచ్చుకుంటూ మరణించటంతో ముందుకు సాగుతుంది. చాలా కొద్దిమంది మాత్రం, ఎంప్యూట్ చెయ్యబడ్డ కాళ్ళతో, మిగులు తారు (మంచులో ఇరుక్కుపోయి రక్తప్రసరణ ఆగిపోయి అంగాలు చచ్చుబడి పోతాయి. వాటిని అంప్యూట్ చెయ్యాలి) అనాలోచితంగా అడుగు ముందుకెయ్యాలా— ఆలోచనతో అడుగు వెనక్కి తీసుకోవాలా అన్న ఘర్షణ నిరంతరం నలిగిపోతున్న నేటి మనిషి వ్యథని చక్కగా చూపించిన చిత్రం "అవలాంచీ."

---

# హూస్ లైఫ్ ఈజ్ ఇట్ ఎనీవే

ఒక అమెరికన్ నాటకం ఇది. ఒకప్పుడు ఒక నాటక సమాజం వారు దీన్ని తీసుకొచ్చి నన్ను అనువాదం చెయ్య

మంటే, చదివి, తెలుగు ప్రేక్షకులకు నచ్చదని నిరాకరించాను. కానీ ఈ చిత్రం చూస్తూంటే నేనెంత తప్పు చేసేనో అర్థమయింది. ఎంతో గొప్ప డ్రామావున్న చిత్రం ఇది.

118 నిముషాలపాటు ప్రేక్షకులని కుర్చీ చివర్ల కూర్చోపెట్టింది.

కెన్ హారిసన్ యువకుడు. అద్భుతమైన శిల్పి. చిత్రం ప్రారంభమయిన అయిదో నిముషంలో ఒక ఘోరమైన కారు ఆక్సిడెంట్‌లో అతడు "ప్రాణంవున్న మాంసపు ముద్దగా" మిగిలిపోతాడు. అతడి మెడనుంచీ క్రిందిభాగం అంతా చచ్చుపడిపోతుంది. కనీసం పక్కకి తిరగలేడు—వారానికి ఒకసారి డయాలిసిస్ ద్వారా అతడి రక్తాన్ని శుభ్రపర్చటం తప్పనిసరి అవుతుంది. తనిక శాశ్వతంగా అలా పక్కమీద జీవచ్ఛవంలా పడివుండాలని తెలుసుకున్న కెన్ ఈ వాస్తవాన్ని భరించలేక తన ప్రాణాన్ని నిలిపే సాధనాలన్నీ ఆపుచెయ్యమని డాక్టర్లని కోరుకుంటాడు. ఆస్పత్రి అధికారులు నిరాకరిస్తే కోర్టునుంచి రక్షణ కోరుకుంటాడు. అక్కడ హారీసన్ వాదన కళ్ళనీరు తెప్పించేట్టుగావుంది. "నేనొక ఉడకపెట్టబడిన కూరగాయలాంటివాణ్ని. నా యీ శరీరం అనే పదార్థం మీద నాకున్న హక్కుని నాకు ఇప్పించండి. కళని సృష్టించగలిగే నా చెయ్యి నా నుంచి వీడ్కోలు తీసుకుని వెళ్ళిపోయింది. నేను మిగిలివున్నానన్న భావం నాకు నరకాన్ని సృష్టిస్తూంది" అని వాపోతాడు. జడ్జి—అతడు చచ్చిపోవడానికి పర్మిషన్ ఇస్తూ-'ఇప్పటివరకూ దోషులకి మరణశిక్ష విధిస్తూ

వచ్చేవాణ్ని. ఇప్పుడు కేసు గెలిచినవాడికి మరణశిక్ష అమలు చెయ్యమంటున్నాను' అంటాడు.

కోర్టు ఆర్డరు ప్రకారం అతడికి డయాలిసిస్ ఆపు చెయ్యబడుతుంది. క్షణక్షణానికి మృత్యువుకి దగ్గరవుతూన్న అతడిని అంతకాలం అతడికి సపర్యలుచేస్తూ ప్రేమించిన డాక్టరు ముద్దుపెట్టుకోవటానికి వంగుతూంటే అతడు తల తిప్పేసుకుంటాడు. "వద్దు నీ యీ ప్రేమ తిరిగి నన్ను ఆశతో ప్రబతకాలనుకునేలా చెయ్యవచ్చు" అంటూ నిరాకరిస్తాడు. కెమెరా ట్రాలీమీద చేతిని స్పష్టం చేస్తుంది. ఆ చేతి వెనుక అతడి శరీరం అవుటాఫ్ ఫోకస్ అవుతుంది. అవుటాఫ్ ఫోకస్ అయిన మనసుల్తో ప్రేక్షకులు సీట్లలోంచి లేస్తారు.

రిచర్డు డ్రేయస్, క్రిస్టిన్‌లాటీ అద్భుతంగా నటించారు. వార్డు బోయ్, నర్సు, చివరికి చీఫ్ సర్జన్ కూడా యెంతో గొప్ప అవగాహనతో నటించిన ఈ చిత్రం తొందర్లోనే ఆంధ్ర దేశంలో విడుదల అవుతుందని ఆశిద్దాం.

# టచ్‌డ్ బైలవ్

మిగతావాళ్ళ సంగతి ఎలా వున్నా నాకు వ్యక్తిగతంగా బాగా నచ్చిన చిత్రం ఇది. వ్యక్తులపట్ల అభిమానం ఆరాధనగా మారి పిచ్చివరకూ వెళ్తుందన్న విషయాన్ని దర్శకుడు గొప్పగా చిత్రీకరించాడు. మానసిక శాస్త్రంమీద ఎంతో అథారిటీ వుంటేగాని ఈ చిత్రంలోని లోతైన నాజూకు పాయింట్లు అర్థం చేసుకోవటం కష్టం.

కరెన్ పన్నెండేళ్ళ అమ్మాయి. సెరెబ్రల్ పాల్సీతో వికలాంగుల గృహంలో వుంటుంది. కరెన్ చాలా అందమైన పాప. మామూలుగా చూసేవారికి యెప్పుడూ మౌనంగా, అందంగా ఓ ముద్దలాగా కనబడుతూందే తప్ప మానసికంగా డిప్రెస్ అయిందన్న విషయం తెలీదు. కొత్తగా చేరిన లీనా అనే నర్సు ఎంతో కష్టపడి కరెన్ యొక్క రెగ్రెషన్‌కి కారణం తెలుసుకుంటుంది. అప్పుడోక అనూహ్యమైన విషయం బైట పడుతుంది.

అమెరికానంతా గిటారు తీగెలమీద తన్మయత్వంతో వణికించేస్తున్న మధుర గాయకుడు ఎల్విస్ ప్రిస్లీ అంటే కరెన్‌కి పిచ్చ అభిమానం. అదే ఆ అమ్మాయి అబ్‌సెషన్. విషయం తెలుసుకున్న లీనా ఆ పాపని ఎల్విస్‌కి ఉత్తరాలు వ్రాయ

మని ప్రోత్సహిస్తుంది. ఎల్విస్ నుంచి జావాబురాదు. కరెన్ తిరిగి రిగ్రెషన్‌లోకి వెళ్ళిపోవటానికి ఆయత్తమవుతుంది. ఇంతలో వుత్తరం వస్తుంది. దాన్ని చూడగానే ఆ పన్నెండేళ్ళ పాప ఎంత ఉద్వేగపడుతుందంటే ఆమె గుండె కొట్టుకోవటం ఆగిపోకుండా డాక్టర్లు ఆక్సిజెన్ యివ్వవలసి వస్తుంది. ఆమె తేరుకుంటుంది. ఎల్విస్‌తో నెమ్మదిగా ఉత్తరాలు కొనసాగిస్తుంది. 'యువర్ లవింగ్ ఫ్రెండ్' అని వ్రాస్తుంటాడు ఎల్విస్. కరెన్ ఆరోగ్యం నెమ్మదిగా బాగుపడుతూ వుంటుంది. ఒక రోజు ఎల్విస్‌నుండి పూలు, ఒక అందమైన బొమ్మ పార్సిల్‌లో కరెన్‌కి కానుకగా వస్తాయి. కరెన్ ఆనందం వర్ణనాతీతం. ఆ రాత్రి రౌండ్స్‌కి వచ్చిన లీనాకి పక్కమీద చుట్టూ పూలతో, మధ్యలో చేతిలో బొమ్మతో కనులు మూసుకుని పడుకున్న కరెన్ కనబడుతుంది. ఆ పాప మొహంమీద చిరునవ్వు మాత్రం చెరగకుండా యేదో సుషుప్తావస్థలో వున్నట్టు అలాగే వుంటుంది. ఆమె వెళ్ళిపోయింది మాత్రం తిరిగి రాని తీరాలకి.

# ఇండియా డాటర్ ఆఫ్ సన్

ఈ చిత్రాన్ని చూస్తున్నంతసేపూ సిడ్నీ షెల్డాన్ వ్రాసిన 'మాస్టర్ ఆఫ్ ది గేమ్' నవల గుర్తొచ్చింది. బ్రెజిల్‌లో ఇప్పటికీ వజ్రాలు దొరికే ప్రదేశాలున్నాయి. జనం మృగాల్లా వాటికోసం వెతుకుతూ వుంటారు. ఒక మిలటరీ ఆఫీసరు, ఇక్కడ అన్యాయాలు చేస్తున్న ఒక జమిందారు లాంటి వాడిని అణచటంకోసం బయల్దేరతాడు. ఇతడు ఒక కోయ యువతిని, ఆమె తండ్రికి ఒక బాటిల్ ఇవ్వటం ద్వారా 'కొనుక్కుంటాడు'. ఆ యువతి మార్గమధ్యంలో ఈ మిలటరీ మనిషిని పాముకాటు వగైరాలనుంచి రక్షిస్తుంది. ఆమెని శుభ్రంగా అనుభవిస్తూ, ప్రయాణం కొనసాగించి, ఆ అన్యాయాలు చేస్తున్నవాడిని చంపి, తిరుగు ప్రయాణంలో, అవసరం తీరిపోయింది కాబట్టి ఆ కోయ యువతిని కూడా పిస్తోలుతో కాల్చేస్తాడు.

చాలా బేవార్సు చిత్రం ఇది. ఎందుకు తీశారో బ్రెజిల్ వాళ్ళకి అర్థం అయిందేమో తప్ప ఫెస్టివల్‌లో ఎవరికీ అర్థం కాలేదు. మిలటరీ మనిషి అయిదు నిముషాలు నడవటాన్ని అయిదు నిముషాలపాటు కెమెరా కదల్చకుండా చూపించి అదే రియలిజం అనుకోమన్నాడు డైరెక్టరు. అయితే కోయ

యువతి స్నానం చేయటాన్ని కూడా అదే వాస్తవికతా దృక్పథంతో చూపించాడు కాబట్టి కొందర్ని సంతృప్తి పరిచింది.

( • )

# మాన్ ఆన్ ది వాల్

పెద్ద కథ లేకపోయినా మంచి థీమ్ వున్న చిత్రం. తూర్పు జెర్మనీని, పశ్చిమ జెర్మనీని విడదీస్తూ కట్టిన చరిత్రాత్మకమైన గోడ.

ఇవతలి దేశంలోంచి అవతలి దేశంలోకి గోడమీదుగా చూస్తూ వుంటాడు కేబ్ అనే యువకుడు. అతడిని పిచ్చాసుపత్రిలో చేరుస్తారు. అక్కణ్నుంచి జైల్లో పడేస్తారు. ఆ గోడ దాటి వెస్ట్ జర్మనీలోకి వెళ్ళాలని అతడి ఆశయం. చివరికి అది తీరిపోతుంది.

కానీ కేబ్ సంతృప్తి చెందడు. ఈసారి అతడికి తూర్పు జెర్మనీ వెళ్ళాలని వుంటుంది. తిరిగి ప్రయాణం కోసం విఫలయత్నం చేస్తాడు. ఒక డ్రిల్లర్ పట్టుకొని ఆ గోడకి కన్నం చెయ్యటానికి ప్రయత్నం చేస్తూ మరోసారి సైనికులకి పట్టుపడిపోతాడు. చిట్టచివరికి అతడికో సత్యం అర్థం అవు

తుంది. ఇక్కడ సమస్య తూర్పా-పడమరా అన్నది కాదు. మధ్యలో గోడ, అది బ్రద్దలుకొట్టనంతకాలం ఈ సమస్య ఇలానే వుంటుంది. జర్మని ఒకే ఒక దేశం! ఏ గోడా దాన్ని విడదీయలేదు- అన్న కాంక్షని వెలిబుచ్చే మంచి పర్పస్ వున్న చిత్రం.

—o—

## ఛోక్ (కళ్ళు)

ఇండియా తరవునుంచి వచ్చిన ఎంట్రీ ఇది బెంగాలీ చిత్రం. జదునాథ్ అనే కార్మిక నాయకుడి ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఒక జూట్ మిల్లులో సమ్మె జరుగుతూ వుంటుంది. ఆ సమ్మె భగ్నం చెయ్యటంకోసం మిల్లు యజమాని రౌడీలని ఏర్పాటు చేస్తాడు. ఆ గొడవలో యజమాని సోదరుడు మరణించి, ఆ హత్యా నేరం జదునాథ్ మీదకు వస్తుంది.

అతడికి ఉరిశిక్ష విధించబడుతుంది.

జదునాథ్ ఆఖరి కోర్కెగా తన కళ్ళను ఎవరైనా తోటి అంధ కార్మికుడికి అందజేయాలని కోరుకుంటాడు. మిల్లు యజమాని కొడుకు గుడ్డివాడు. కాబట్టి మిల్లు యజమాని ఈ

కళ్ళని కాజెయ్యాలని పథకం వేస్తాడు. దీనికి డాక్టరు అడ్డుపడి తను ఆపరేషన్ చెయ్యనంటాడు. తన కొడుకుకు ఉపయోగ పడని కళ్ళని పూర్తిగా నాశనం చెయ్యటానికి మిల్లు ఓనరు ప్రయత్నం చేస్తాడు. ఈ లోపులో జదునాథ్ భార్య, డాక్టర్ సాయంతో ఒక వూరేగింపు లేవదీస్తుంది. ఈ ఊరేగింపు పోలీసులకి ఎదురుగా నడుస్తూ వుంటుంది.

కథ కృతకంగా, మెలోడ్రామాతో వున్నా, నటన, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం మొదలైన విలువలు బావుండ టంవల్ల స్పెషల్ ప్రైజు వచ్చింది.

—//—

# బోయ్స్ విల్ బి బోయ్స్

త్వరలో చిరంజీవి హీరోగా తెలుగులో ఈ చిత్రాన్ని తీయటానికి అప్పుడే సన్నాహాలు జరుగుతున్నాయి. అబ్బా యిల హాస్టలు ఎదురుగా అమ్మాయిల హాస్టలు...అబ్బా యిల హాస్టల్లో ఒక గదిలో స్టాండుకు అమర్చిన బైనా క్యులర్స్. (దాంట్లోంచి చూడాలంటే అద్దె చెల్లించుకోవాలి) హాస్టలు వార్డెను సహజంగా కర్కోటకుడు. ఆ గదిలో అయిదు గురు అబ్బాయిల్నీ ఎలాగైనా, ఏదైనా నేరం మోపి శిక్షించా లని కంకణం కట్టుకుంటాడు-దానికి తగిన కారణం వుంది మరి. ఒకరోజు పోలీసులకి ఫోన్ వచ్చింది- ఫలానా వార్డెన్‌ని ఆయన

గదిలో పని చేసుకుంటూ వుండగా ఆకతాయి కుర్రాళ్ళు బైట తాళంవేసి బంధించారని. బిలబిలమంటూ పోలీసులు ఆయన్ని రక్షించటానికి వెళ్తారు. ఆ మహాశయుడు శుభ్రంగా తన గదిలో పనిచేసుకుంటూ వుంటాడు. పోలీసుల తెలివి తక్కువ తనాన్ని చూసి బిగ్గరగా నవ్వేసి, వాళ్ళ బాధ్యతల గురించి పెద్ద స్పీచ్ ఇస్తాడు. నాల్రోజులు పోయాక ఆయన ఫోన్ చేసి తనని ఈసారి నిజంగానే బంధించారని వాపోతాడు. పోలీసు మాత్రం తాపీగా - 'పొండి సార్ ! మా బాధ్యతలు మాకు తెలియవేంటి' అని కొట్టి పారేస్తాడు. ఇలా కడుపుబ్బ నవ్వించే సంఘటనలు చాలా వున్నాయి. అర్ధరాత్రి హాస్టల్ లోకి అమ్మాయిని తెచ్చుకుంటున్నారని తెలిసి వార్డెన్ ప్రిన్సిపాల్‌కి దీన్ని ప్రత్యక్షంగా చూపించాలని తీసుకొచ్చి ఆ అమ్మాయి గౌను విప్పి-అబ్బాయి అవటం వగైరా సంఘటనలు, బోరెక్కిపోయిన ప్రేక్షకుల్ని బాగా సంతృప్తిపరిచి నవ్వించాయి. చివరికి వార్డెన్‌ని తీసేసి సుహాసినిలాటి అమ్మాయిని వార్డెన్‌గా వెయ్యటంతో కోతిమూక వానరసైన్యం అయిపోయింది. తరువాత సుఖాంతం. ఈ చిత్రంలో వున్న గొప్పతనం ఏమిటంటే ఎన్నో సంఘటనల్ని (అన్నీ నవ్వించేవే) చాలా జాగ్రత్తగా పేర్చుకుంటూ వచ్చి-గ్రావు చెడకుండా చూడటం. సాధారణంగా తెలుగులో ఇలాంటి గ్రావు వున్న చిత్రం మిస్సమ్మ తరువాత మరొకటి రాలేదు. ఉన్న ఎనిమిది పాటలూ వినసొంపుగా వున్నాయి.

—||—

# చిక్వియమ్

హంగేరి చిత్రం ఇది. జోల్టాన్ ఫేబ్రీ గొప్ప దర్శకుడిగా పేరు పొందాడు. దానికి తగ్గట్టే ఈ చిత్రం కూడా గొప్ప దర్శకత్వపు విలువలని కలిగి వుంది.

మిసెస్ ఆగస్టన్ నెటీ అనే 28 యేళ్ళ యువతి తన డాక్టరు భర్తతో కలిసి మరునటి రోజు ప్రొద్దునే శలవులను సరదాగా గడపటం కోసం వెళ్ళటానికి ఆయత్తమవుతూ వుంటుంది. ఆ రాత్రి భర్త కొంచం ఆలస్యంగా వస్తానని ఫోన్ చేస్తాడు. ఆ సమయంలో 'పేలీ' అనే కుర్రవాడు ఆ యింటి తలుపు తడతాడు. మిసెస్ ఆగస్టన్ అతడిని చూసి విస్మయం చెందుతుంది. అతడి ప్రతీ కదలికలోనూ ఆమెకి తన జీవితపు మొదటి స్నేహితుడు ఇస్ట్వాన్ గుర్తొస్తాడు. అదే బెదురు, అదే కంపనం.. స్త్రీ అంటే భయం

పేలే జైలునుంచి ఆ రోజే విడుదలయ్యాడు. జైల్లో ఇస్ట్వాన్‌తో కలిసి ఒకే గదిలో అన్ని రోజులూ వున్నాడు పేలే. సంవత్సరాల తరబడి ఇస్ట్వాన్ తన స్నేహితురాలి గురించి ప్రతి అంశమూ-చివరికి సెక్స్‌తో సహా వర్ణించి చెప్పాడు. పేలే ఆమెని ఒక అపురూప దేవతగా వూహించుకొన్నాడు. జైల్లో ఇస్ట్వాన్ చచ్చిపోయాడు. కొంతకాలానికి పేలే విడుదల అవుతాడు.

ఈ చిత్రంలో గొప్ప అంశం ఏమిటంటే రెండు పాత్రల మధ్య జరిగిన ఒక సంఘటనని ఒక పాత్ర దృష్టి (పాయింట్ ఆఫ్ వ్యూ) నుంచి ముందు చూపించి తిరిగి అదే సంఘటనని రెండో పాత్ర దృష్టినుంచి మళ్ళీ చూపించటం. చాలా మంచి టెక్నిక్ ఇది.

స్త్రీ పట్ల తన భయాన్ని పోగొట్టటానికి తన ప్రియురాలు ఎంతో నేర్పరితనంతో చేసిన ప్రయత్నాల్ని పది సంవత్సరాలుగా జైల్లో ఇస్ట్వాన్ నిన్న మొన్న జరిగిన దాన్నంత లేత దనంతో గుర్తుచుకొని, ఆ వూహాల్లో తేలి పోతూ స్నేహితుడితో పాలు పంచుకుంటాడు. 'పేలే' కూడా స్త్రీ అంటే అదే భయంతో బాధపడుతున్నవాడు. అతడు ఒక అమ్మాయి దగ్గిర ఘోరంగా విఫలమైన ఆ గొడవలో 'రేప్' చార్జి క్రింద జైలుకి వచ్చినవాడు. అందుకే విడుదలయిన మొదటిరోజే ఆమె దగ్గిరకి వస్తాడు.

మరణిస్తూ చివరి కానుకగా తన స్నేహితుడు పంపిన 'పేలే'ని ఆ రాత్రి ఆమె ఆదరిస్తుంది. అతనికి స్త్రీ అంటే యేమిటో చూపిస్తుంది. అతడిని తన అనుభవంలో ఒక మైనం ముద్దగా కరగిస్తుంది పేలే తన భయాల్నించి బయటకు రావటానికి ఆమె ఎంతో నాజుగ్గా, నేర్పరిగా, అనుభవజ్ఞురాలిగా సాయపడుతుంది.

తన పాత జ్ఞాపకాలు తనని వెంటాడగా ఆ మరునటి రోజు ప్రొద్దునే తన భర్తనుంచి వేరు పడటానికి ఆమె నిర్ణయించుకోవటంతో కథ ముగుస్తుంది. సెక్సు కేవలం శారీరక

వాంఛే అన్న భ్రమలో అందాన్ని ఆస్వాదించడం తెలియని ప్రతి ఒక్కరూ చూడదగ్గ చిత్రం యిది - (సెన్సార్ వప్పు కుంటే.)

ఇవీ- ఫెస్టివల్‌లో కొన్ని మంచి చిత్రాలు. ఇవి గాక ఇంకా బ్రిటానియా హాస్పిటల్, కమ్ బ్యాక్ రోల్, మిస్సింగు అన్న కొన్ని మంచి చిత్రాలు కూడా వున్నాయి. అయితే పైన చెప్పిన చాలావాటితో సహా యివన్నీ పోటీకి- వచ్చిన చిత్రాలుకావు, కేవలం ప్రదర్శనకోసం వచ్చినవి. అందుకే బంగారు నెమిలి పొందటానికి ఏ చిత్రమూ అర్హమైనది కాదు అని జడ్జి ప్రకటించినప్పుడు హాలంతా ఆనందాతిరేకంతో, చప్పట్లతో నిండిపోయింది.